నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్,డిసెంబర్ 29: విద్యుత్ కేబుళ్ల మరమ్మతులు,చెట్ల కొమ్మల కత్తిరింపుతో పాటు ఇతర పనుల కారణంగా సోమవారం బంజారాహిల్స్ సబ్ డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ సబ్ డివిజన్ ఏడీఈ గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిగూడ సబ్ స్టేషన్ పరిధిలోని ఎల్ఐసీ కాలనీ, బ్రైట్ కాలనీ, ఉషా ఎన్‌క్లేవ్, బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2 సబ్ స్టేషన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 7, 14, యానిమల్ కేర్ క్లినిక్, రోడ్డు నంబర్ 4, ఉడిపి హోటల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు కరెంట్ సరఫరా ఉండదు. యూసుఫ్‌గూడ సబ్ స్టేషన్ పరిధిలోని పెద్ద మజీద్, కృష్ణా నగర్ సీ-బ్లాక్ , బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2 సబ్ స్టేషన్ పరిధిలోని అరోరా కాలనీ, బాలాజీ అపార్ట్‌మెంట్, పెట్రోల్ పంప్. రోడ్ నంబర్ 3 తదితర ప్రాం తాల్లో మధ్యాహ్నం 2 నుంచి మ ధ్యాహ్నం సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

ఖైరతాబాద్, డిసెంబర్ 29 : భారత మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్‌కు భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించాలని తెలంగాణ సిక్ యూత్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. ఆదివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సంతాప సభలో న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు జోరావర్ సింగ్, జస్బీర్ సింగ్ షికారి, హర్జోత్ సింగ్, రిష్పాల్ సింగ్‌లు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడంలో కీలక భూమిక పోషించారన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలకు గాను భారతరత్న ఇవ్వడంతో పాటు దేశ రాజధానిలో మన్మోహన్ సింగ్ పేరిట ఘాట్ ఏర్పాటు చేయాలని, ఆయన చరిత్రలో జాతీయ స్థాయిలో పాత్యాంశంగా చేర్చాలన్నారు.

డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కాచిగూడ: నూతన సంవత్సర వేడుకల ముసుగులో యువతి, యువకులను టార్గెట్ చేస్తూ డ్రగ్స్ సరఫరా చేస్తున్న వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్ లక్ష్మణ్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇరత రాష్ట్రాల నుంచి రాత్రి సమయంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని, వారిపై ప్రభుత్వం నిఘా ఉంచాలన్నారు.

సీవరేజీ సమస్యలకు చెక్

- రేపటితో ముగియనున్న 90 రోజుల కార్యాచరణ..
- ప్రత్యేక సిబ్బంది, యంత్రాలతో వేగంగా పూడికతీత పనులు..

సీవరేజీ పూడికతీత పనులు పరిశీలిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్. (ఫైల్)

జూబ్లీహిల్స్,డిసెంబర్ 29 : సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ లక్ష్యంగా హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, సీవరేజీ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ) చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌తో సీవరేజీ సమస్యలకు చెక్ పెట్టారు. గతంలో మురుగునీటితో ముంచెత్తిన రహదారులపై 'మురుగు.. పరుగు..' ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయి. ఈ ఏడాది అక్టోబర్ 2 నుంచి డిసెంబర్ 31 వరకు 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపట్టిన హెచ్ఎం ఎస్‌బీ అధికారులు పూడికతీత పనులను ప్రణాళికాబద్ధంగా అమలుచేశారు. ఇందులో భాగంగా మ్యాన్‌హోళ్లతో పాటు సీవరేజీ పైప్‌లైన్లలో భారీగా వ్యర్థాల తొలగింపు పనులను పకడ్బందీగా చేపట్టారు. సీవరేజీ సమస్యలు తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక సిబ్బంది, ఆధునిక యంత్రాలతో వేగంగా పూడికతీత పనులు చేపట్టారు. దీంతో జలమండలి డివిజన్-6 లో 9200 మ్యాన్‌హోళ్లతో పాటు 150 కిలోమీటర్ల సీవరేజీ లైన్లలో డీ సిల్టింగ్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఎల్లారెడ్డిగూడ సెక్షన్‌లో 9 కిలో మీటర్లు, వెంగళరావునగర్ సెక్షన్‌లో 7.5 కి.మీ, ఎర్రగడ్డ సెక్షన్‌లో 9.4 కి.మీ, ఎస్‌పీఆర్ హిల్స్ సెక్షన్‌లో 9.1 కి.మీ, బోరబండ సెక్షన్‌లో 11 కి.మీ, వెంకటగిరిలోని జూబ్లీహిల్స్ సెక్షన్‌లో 27 కిలో మీటర్ల పైప్‌లైన్‌లలో పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. దీంతో పాటు ఎల్లారెడ్డిగూడ సెక్షన్‌లో 453 మ్యాన్‌హోళ్లు, వెంగళరావు నగర్ సెక్షన్‌లో 512, ఎర్రగడ్డ సెక్షన్‌లో 612, ఎస్‌పీఆర్ హిల్స్ సెక్షన్‌లో 819, బోరబండ సెక్షన్‌లో 943, ఎస్ఆర్ నగర్ సెక్షన్‌లో 603, ఫతేనగర్ సెక్షన్‌లో 613, వెంకటగిరిలోని జూబ్లీహిల్స్ సెక్షన్‌లో 1479 మ్యాన్‌హోల్‌లను శుభ్రం చేసి సుమారు 1080 టన్నుల సిల్ట్‌ను తరలించామని అధికారులు వెల్లడించారు.

90 రోజుల స్పెషల్ డ్రైవ్ విజయవంతం

సీవరేజీ పైప్‌లైన్‌లలో పేరుకుపోయిన వ్యర్థాలను సమూలంగా తొలగించి సీవరేజీ ఓవర్ ఫ్లో సిటీ లక్ష్యంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్ విజయవంతమైంది. ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జెట్టింగ్ యంత్రాలతో.. మ్యాన్‌హోల్స్‌లోకి మనుషులు దిగకుండా మానవరహిత పనులు చేపట్టాం. సీవరేజీ సమస్యలు వస్తే 155313 టోల్ ఫ్రీ నెంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

– ఎస్.హరిశంకర్, జనరల్ మేనేజర్, జలమండలి, డివిజన్-6

అవార్డుతో పెరిగిన మరింత బాధ్యత

మోతుకూరి రాంచందర్‌కు అవార్డును అందజేసి సత్కరిస్తున్న కేఎస్‌మూర్తి

హిమాయత్‌నగర్,డిసెంబర్ 29: సమాజంలోని మానసిక రుగ్మతల నిర్మూలన కోసం కృషి చేస్తున్న తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసీయేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హ్యూమనిటేరిస్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఇటీవల నగరంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాంచందర్‌కు ఈ అవార్డును యాక్ట్‌నవ్ సంస్థ నిర్వాహకులు ఎక్సలెన్స్ అవార్డును అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ మానవతా సేవా రంగంలో తాను చేస్తున్న సేవకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేయడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

నిరంతరం సైకాలజీ రంగ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఔత్సాహిక సైకాలజీలపై అవగాహన కల్పించేందుకు చొరవ తీసుకుంటామన్నారు.ఈ అవార్డు అందజేసిన యాక్ట్‌నవ్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ మూర్తి,ప్రతినిధి డాక్టర్ హరిణికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

సగర సంఘం ఎన్నిక

మణికొండ భగీరథ సగర(ఉప్పర) సంఘం నూతన సభ్యులు

మణికొండ, డిసెంబర్ 29: భగీరథ సగర(ఉప్పర) సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయనున్నట్లు నూతన అధ్యక్షుడు గుంటి వెంకటస్వామి సాగర్ అన్నారు. మణికొండ భగీరథ సగర (ఉప్పర) సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంటి వెంకటస్వామిసాగర్, ప్రధాన కార్యదర్శిగా గుంటి గోపాల్ సాగర్, వేముల కృష్ణసాగర్, కోశాధికారిగా పోతులపల్లి కృష్ణయ్య, నాగేశ్వర్ సాగర్, ఉపాధ్యక్షులుగా కందురి అశోక్‌సాగర్, రాంపూరం నర్సింహులు సాగర్, గుంటి కృష్ణసాగర్, గౌరవ సలహాదారులుగా చీర్ల కాశన్న సాగర్, ఆస్కాని నాగరాజు సాగర్, చిలుక బుచ్చన్న సాగర్, ఆస్కాని వెంకటస్వామిసాగర్, సంయుక్త కార్యదర్శులుగా వేముల అశోక్‌సాగర్, కందూరి రఘుపతిసాగర్, కందూరి బాలకృష్ణసాగర్, సుక్కలి వెంకటేష్‌సాగర్, కూరుకుంట్ల శేఖర్‌సాగర్, చీర నాగరాజుసాగర్, గుంటి రవిసాగర్, రాంపూరం బాలరాజ్, బి.నర్సిహసాగర్, ప్రచార కార్యదర్శులుగా కురుకుంట్ల గిరిసాగర్, జి.రాజుసాగర్, చిలుక విష్ణు, రాంపూరం రమణ, బూదురు యాదయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

గ్లోబల్ వార్మింగ్‌పై ఓ విద్యార్థి గీసిన చిత్రలేఖనం

చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులు లక్ష్యాన్ని ఛేదించాలి

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 29: విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షులు ఎం.ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి జి.శ్రావణ్‌కుమార్‌లు అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో అత్తాపూర్‌లోని హైదరాబాద్ స్కాట్స్ హై స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 1000 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పర్యావరణంలో వస్తున్న మార్పుల వల్ల కలుగుతున్న నష్టాలు కళ్లకు కట్టినట్లు తమ చిత్రలేఖనంతో ఉదహరించారు. వ్యవసాయం ప్రాముఖ్యత, భూమి సారవంతంగా ఉంటే ఎలాంటి లాభాలు ఉంటాయి, గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఎదుర్కొంటున్న, ఎదురవుతున్న సమస్యలను వివరిస్తూ వారు గీసిన చిత్రాలతో కూడిన నమూనాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్లాస్టిక్ వినియోగం వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలు, ప్లాస్టిక్ రిసైక్లింగ్ ఆవశ్యకతను విద్యార్థులు లేఖనం, వ్యాసరచన ద్వారా వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రాణితన వంతు పాత్ర పోషిస్తుందనే నిజాన్ని వన్యప్రాణులు, పక్షులు పాత్ర సహజసిద్ధ అటవీలో ఏ విధంగా ఉంటుందో విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి ఆవిష్కృతం చేశారు. రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం కోశాధికారి ఎస్.ఆర్.రజనీకాంత్, క్రీడా, సాంస్కృతిక విభాగాల కార్యదర్శులు వేణుగోపాల్, బోయ లక్ష్మణ్, హైదరాబాద్ స్కాట్స్ స్కూల్ అధినేత జి.జగన్నాథం, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు కరుణాకర్, రాజేంద్రప్రసాద్, భాస్కర్, సందీప్, వాజీద్, శేషు, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

వంజరి కులస్తుల సంక్షేమానికి కృషి

గోల్నాక : సామాజికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్న వంజరి కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్ న్యూపటేల్ నగర్ కమ్యూనిటీ హాల్లో అంబర్‌పేట వంజరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర ప్రతినిధి కరిపె జగన్ మోహన్‌రావు, అంబర్ పేట వంజరి సంఘం అధ్యక్షుడు ఆంజనేయులుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై...ఆ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు డౌరె గంగరాజు, వారె బాలకృష్ణ, వంజరి నాగరాజు, భూమన్న, కరిపె చంద్రశేఖర్, విఠల్, రాజశేఖర్, ఎదుగని అశోక్, ఎంకే రాజు, లవంగు నాగరాజు, శంకర్, కాళిదాస్, సాటికె రాజు, పోత్నక్ ప్రకాశ్, పి.శ్రీనివాస్, లక్ష్మణ్, నరేశ్, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీఓబీ యూత్ అధ్యక్షుడిగా పల్లపు శ్రీకాంత్

అఖిల భారత వడ్డెర ఒడ్డె భోవి జూబ్లీహిల్స్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా రహ్మత్‌నగర్ డివిజన్‌కు చెందిన పల్లపు శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గింజ శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు వేముల తిరుమల దేవి చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి నగేష్, మహిళా ప్రధాన కార్యదర్శి పార్వతి, గ్రేటర్ యువజన విభాగం అధ్యక్షుడు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్,డిసెంబర్ 29

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అబిడ్స్: రాజా బహదుర్ వెంకట్‌రామ్ రెడ్డి హాస్టల్ 106 సంవత్సరాల చరిత్ర కలిగిన విద్యా సంస్థ. ఈ సంస్థ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అబిడ్స్‌లోని రెడ్డి కళాశాలలో నిర్వహించారు. దాదాపు 1200 మది పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులలో తెలంగాణ ఆర్ అండ్ బి శాఖా, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కూడా ఒకరు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తోటి విద్యార్థిగా, ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజా బహదుర్ వెంకట్‌రామ్ రెడ్డి గొప్ప సంస్కర్త అని, అసమాన ప్రతిభ కలిగిన పోలీస్ అధికారి అని, కుల మతాలకు అతీతంగా ఎన్నో విద్యాలయాలకు సహాయ సహకారాలు అందించిన విద్యా ధాత అని అన్నారు. ఆయన తన పరిపాలన విధానంలో ఎలాంటి సంకుచిత భావాలు లేకుండా సమస్త రాష్ట్రాన్ని తన స్వంత కుటుంబంలా భావించిన మహా మనిషి అని కొనియాడారు. ఆనాటి రోజుల్లో పల్లెల నుండి నగరానికి రావడమే గగనమైన రోజుల్లో నగరంలోని ప్రధాన ప్రాంతాలైనటువంటి అబిడ్స్, నారాయణ గుడా ప్రాంతాలలో యువతీ, యువకుల విద్యాభ్యాసం కోసం కృషి చేశారు. మంత్రు లు, ముఖ్య మంత్రులకే కాక ఒకప్పటి ప్రధాన మంత్రికి కూడా జీవితపాఠాలు నేర్చుకోవడాని అవకాశం కల్పించిన గొప్ప వ్యక్తి రాజా బహదుర్ వెంకట్ రామ్‌రెడ్డి అని అన్నారు. వివిధ రకాలైన విద్యా కోర్సు ల వారు ఒకే దగ్గర ఉండడం ద్వారా కాస్మోపాలిటిన్ కల్చర్ అలవాటవడం గొప్ప వరమన్నారు.

పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బేగంపేట్, డిసెంబర్ 29: సికింద్రాబాద్‌లో పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుపై ట్రాఫిక్ పోలీసులు మరింత వేగం పెంచారు. ట్రాఫిక్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహంకాళి, బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పుట్‌పాత్‌లపై వెలిసిన డబ్బాలు, షెడ్లను ఆదివారం తొలగించారు. ఐదు రోజులుగా ఆక్రమణలను తొలగిస్తున్నామని ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం సికింద్రాబాద్ సుభాష్ రోడ్డులోని నాగెల్లి దుర్గయ్య ప్రభుత్వ పాఠశాలను ఆనుకొని కొంతమంది పుట్‌పాత్, పాఠశాల గోడ స్థలాన్ని ఆక్రమించి పుట్‌పాత్ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుతో ట్రాఫిక్ పోలీసులు సుభాష్ రోడ్డులో రోప్‌వే నిర్వహించి ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. అలాగే 31బస్టాప్, రాణిగంజ్, ఎంజీ, రోడ్డు, ఆర్పీ రోడ్డుల్లో కూడా పుట్‌పాత్ ఆక్రమణలను తొలగించినట్టు ఏసీపీ తెలిపారు. తిరిగి పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే తిరిగి తొలగిస్తామని హెచ్చరించారు.

సావిత్రిబాయి ఉపాధ్యాయ రత్న అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, డిసెంబర్ 29: సావిత్రిబాయిపూలే ఉపాధ్యాయ రత్న, స్వామి వివేకానంద నేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2025 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్ తెలిపారు. భారత మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, కుల, మత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిని సావిత్రిబాయి పూలే అని అన్నారు. జనవరి 3న ఆమె జయంతి తోపాటు మహోతన్నతమైన ఆధ్యాత్మిక తత్వవేత్త స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని అవార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఉపాధ్యాయులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులకు సమాజ సేవకులకు ఇతర రంగాల ప్రముఖులకు సావిత్రిబాయిపూలే ఉపాధ్యాయ రత్న, స్వామి వివేకానంద నేషనల్ ఎక్సలెన్స్ అవార్డులను జనవరి 12న ప్రదానోత్సవం చేయనున్నట్లు తెలిపారు. జనవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విరాల కోసం 96523 47207లో సంప్రదించాలని సూచించారు.

ప్రేమ విందు

రహ్మత్‌నగర్ డివిజన్ బీజేఆర్‌నగర్ చర్చిలో ఆదివారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ ఫీస్ట్ (ప్రేమ విందు)ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చర్చ్ పాస్టర్‌లు, స్థానిక సంఘ నాయకులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్,డిసెంబర్ 29

అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో క్రిస్మస్ పర్వదినం, న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకొని ప్రేమ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదర్‌గూడ డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్‌లో అగాపే ప్రేయర్ టెంపుల్ పాస్టర్ రాజ్‌కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్, వనం నర్సింహ, సోమారం రాజ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. – మైలార్‌దేవ్‌పల్లి

పీడిత ప్రజల గొంతుక సీపీఐ

సికింద్రాబాద్, డిసెంబర్ 29: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాలను సికింద్రాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహం ముందు జరిగిన కార్యక్రమానికి ఆపార్టీ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ నాయకురాలు ప్రేం పావని శతాబ్ది ఉత్సవాల జండా ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోరాటాలే ఊపిరిగా ఈ దేశంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచిందని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పోరాటాలను కొనసాగిస్తున్న పార్టీ కేవలం సీపీఐ మాత్రమేనని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన ఉద్యమం మొదలుకొని, తెలంగాణ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని వేలాది కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. వందలాది ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర సీపీఐదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పీడిత తాడిత ప్రజల వైపు నిలబడుతున్న పార్టీ కేవలం సీపీఐ మాత్రమేనని కొనియాడారు. పోరాట త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ప్రజా సంక్షేమ కోసం జరిగే పోరాటంలో కార్యకర్తలంతా భాగస్వామ్యం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు గణేశ్, సాయి ఆట పాటలతో శ్రేణులను ఉత్తేజ పరిచారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, జోగు రాములు, శ్రీహరి, యాదగిరి, రాజు, పద్మ, నాగమణి, రూప, వెంకటేశ్, మహేశ్, జెల్ల కొండలు, యాకయ్య, యాకోబు, హుస్సేన్, పంగ శీను తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి చౌరస్తాలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

శీతాకాలంలో ఆహ్లాదంగా....

వింటర్ ఉత్సవ్ మేళాకు బారులు తీరిన సందర్శకులు

అసలే చలికాలం....అందులో సాగర తీరాన చల్ల చల్లని...ఆహ్లాదకరమైన

వాతావరణంలో ఏర్పాటు చేసిన వింటర్ ఉత్సవ్ మేళాకు సందర్శకులు బారులు తీరారు. ఆదివారం సెలవు దినం కావడంతో సిటీ నలుమూలల నుంచి నగరవాసులు తరలివచ్చారు. నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన వింటర్ ఉత్సవ్ మేళాను విశేషంగా ఆకట్టుకుంటున్నది.

కశ్మీర్‌ను తలపిస్తూ ఏర్పాటు చేసిన మంచుకొండల సెట్టింగ్‌లు, పిల్లలకు ఆటవిడుపుగా అమ్యూజ్‌మెంట్స్, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేతి వృత్తులు, చేనేత వస్త్రాలు ఆకర్షిస్తున్నాయి.
– ఖైరతాబాద్, డిసెంబర్ 29 :